# కళ్ళజోడు

"ఏమంటావురా?"

"నాకు ఆ అమ్మాయి నచ్చలేదు. నన్ను విసిగించకండి"

"పిల్ల చక్కగా ఉంది. చదువుకుంది. మంచి కుటుంబం- ఆస్తిపాస్తులున్నాయి. ఇందులో నీకు నచ్చనిదేముంది బాబూ?"

ప్రతాప్ ససేమిరా ఒప్పుకోలేదు. ఎన్ని సంబంధాలు చూసినా ఏదో వంక పెడుతూనే ఉన్నాడు. ఒక పిల్లను 'లావు' అన్నాడు. ఇంకో అమ్మాయిని 'మరీ సన్నం ఎముకల పోగు' అన్నాడు. మూడో అమ్మాయి 'కళ్ళు మరీ చిన్నవ'ట.

''ఇలా వంకలు పెట్టావంటే చివరికి నీకు పెళ్ళి కావడమే కష్టమైపోతుంది'' అని విసుక్కున్నాడు తండ్రి.

''ఏమైనా ఇది నా జీవితానికి సంబంధించిన విషయం. నా ఆశయాలకు తగిన అమ్మాయి దొరికే వరకూ నేను పెళ్ళి చేసుకోను''


''ఆశయాలట- ఆశయాలు! వీడు పెద్ద అందగాడు కాబోలు!'' అని తండ్రి గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

''నువ్వేమైనా చెప్పమ్మా! నా భార్య కాదగిన పిల్లకు ఏ లోపం ఉండటానికి వీల్లేదు.''

''ఏమిటోరా నీ వెర్రి! ఇప్పుడు మనమనుకుంటున్న పిల్లకు ఏం లోటు?''

''కళ్ళజోడమ్మా- ఇప్పుడే ఇలా ఉంది- ఇంక కొన్నాళ్ళకు పూర్తిగా గుడ్డిదైతే...''

''ఛ- అవేం మాటలురా! కళ్ళజోడున్న వాళ్ళందరూ గుడ్డివాళ్ళేనేమిటి? మీ నాన్నగారికి లేవా? నాకు లేవా ఏమిటి? కళ్ళద్దాలు''



''మీ సంగతి వేరు. వయసుమళ్ళాక ఎవరైనా పెట్టుకోవలసి వస్తుంది''

మొత్తానికి ఆ సంబంధమూ తిరగ్గొట్టాడు ప్రతాప్.

చివరకు అతను మెచ్చిన సంబంధాన్నే చేశారు తల్లిదండ్రులు.

ఆ అమ్మాయి ప్రతాప్ కలలకు తగినట్లుగా అందంగా, అజంతా శిల్పంలా ఉంది. ధనవంతుల గారాల పట్టి. మోడరన్‌గా ఉంది. పెళ్ళయిన మూడో రోజే హనీమూన్‌కు బయలుదేరారా దంపతులు.

బెంగుళూరులో ఖరీదైన హోటల్లో దిగారు. స్నానం, భోజనం, కబుర్లు అయ్యాక, ''చాలా రాత్రి అయింది'' అన్నాడు ప్రతాప్.

''మీరు పడుకోండి. నేను డ్రెస్ మార్చుకు వస్తాను'' అంటూ డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళింది.

ప్రతాప్ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని పడుకున్నాడు. అయిదు నిమిషాలకు నవ వధువు వస్తున్న అడుగుల చప్పుడు!

కళ్ళు తెరచి చూశాడు. గులాబి రంగు నైటీలో ఒంపుల వయ్యారి..'అరె! అదేమిటి? ఆ కళ్ళజోడు?'

''నీకు కళ్ళజోడుందా?'' అన్నాడు ఎలాగో గొంతు పెగల్చుకొని.

''అఫ్‌కోర్స్! అది లేకపోతే రెండు గజాల దూరంలో ఉన్న వస్తువులు కూడా స్పష్టంగా కనిపించవు నాకు.''

''మరి..పగలంతా?..''

''కాంటాక్ట్ లెన్స్ వాడతాను. రాత్రిళ్ళు అవి తీయక తప్పదుగా మరి?'' మెల్లగా అంది.

ప్రతాప్ అలాగే గుడ్లప్పగించి ఉండిపోయాడు.

**-వై. వెంకటేశ్వర్లు (గుంటూరు)**

